# 18. కళారాధకులు

శుక్రవారం ఉదయమని గుర్తు - వాసును చూడబొయ్యాను. ఉదయాన వాడు కోర్టు వ్యవహారాల్లో నిమగ్నుడై వుంటాడని తెలుసు. ఐనా ఎటూ ఇంత దూరమూ వచ్చాం కదా, తొంగిచూసే పోదా మనిపించింది.

ఎందుకనో కాని ఇవాళ వాసు చాలా తీరిగ్గా వున్నాడు. పెదవులు కాల్చుకోకుండా కాఫీ తాగాడు. చాలా ఉల్లాసంగా కూడా వున్నాడు. విశ్రాంతి దొరికిందో, లేక మంచి కేసు లేమన్నా వొచ్చినవో తెలియలేదు.

లోకాభి రామాయణం మొదలు పెట్టాము. ఆఫీసు కిటికీ దగ్గిరగా వొక ముప్పై ఏళ్ళ ఆడది వచ్చింది. అంతకు పూర్వమే రోడ్డుమీద నుంచి అర్థిస్తూ ఎలుగెత్తి అరచింది కాని, మేము వినికూడా విననట్లే వూరుకున్నాము. బహుశా మాకు తన దీనాలాపాలు వినిపించ లేదనే అనుమానంతోనే, ఈ బిచ్చుగత్తె పెద్ద గేటు దాటి, సరాసరి ఆఫీసు కిటికీ దగ్గిరికి వచ్చింది.

"బాబూ! రెండు రోజుల్నుంచీ కూడు లేదు..." అని మొదలెట్టింది.

వొంట్లో వున్న ఊపిరంతా మాట్లాడేందుకు- కాదు- అరచేందుకే ఉపయోగిస్తోంది. చిరిగిన చీర ఆమె శరీరాన్ని పూర్తిగా కప్పలేకపోతోంది. చేతులో వున్న తుప్పు పట్టిన డాల్డా డబ్బా చూస్తే, ఈమె యీ వృత్తిలో చాలా కాలంగా ఉన్నదనిపిస్తుంది. చంకలోని జోలెలో నిద్రిస్తున్న పసిపిల్లవాణ్ని చూస్తే, యీమె సంసారంతోనే వృత్తిధర్మాన్ని నిర్వర్తించేందుకు బయలుదేరిందని తెలుస్తూనే వుంది. ఎందుకనో కాని, ఆమె ముఖ కళ చూస్తే నాకు చాలా జాలి వేసింది.

"ఏమిటీ - రెండు రోజులుగా కూడు లేదా? మరి నీరసించి ఒక మూలపడి ఉండాల్సింది పోయి, సంసారంతో సహా వూరిమీదికి బలాదూర్లకు బయలుదేరావా?... ఆ గొంతు చూడు... మనం అలా అరవగలమా?" అన్నాడు వాసు నా వైపు చూసి.

ఈ ముష్టిదాంతో తర్కా లేమిటి - ఏదన్నా ధర్మంచేస్తే చెయ్యటం, లేదంటే వెళ్ళమనటంతో సరిపెట్టక? ఐనా నే నా మాట పైకి అనలేదు.

"బాబూ! బిడ్డకు పాలు లేవు–" అంటోంది ఆ బిచ్చగత్తె.

"ఉహుం... మమ్మల్ని ఉద్ధరించనే ఈ సంతానాన్ని కన్నావా? ఆ తండ్రి ఏ మయ్యాడు? దుక్కలా గున్నావ్ - పని చేసుకోలేవూ! ప్రతివాళ్లకు ఇదొక వృత్తయింది...ఫో...ఫో..." అన్నాడు వాసు.

వాసు ఇంత కఠినంగా మాట్లాడటం నాకు కష్టంగానే వుంది. అయితే యిది కారణంగా నేను ముష్టిదాని పక్షానజేరి వాడితో వాదించలేను. నిజానికి ఈమె పనిపాటులు చేసుకొని జీవించ వొచ్చనిపించింది. ఆ మాట అంటే, ఆ పనేదో చూపమంటుం దేమోనని భయం. ఇక సంతానమా – కావాలని కోరకుండానే వొచ్చి ఉండొచ్చు.

"బాబూ! మహారాజులు. ధర్మదాతలు కరుణించాలి" అంటోంది, ముష్టిది దీనంగా, జాలిగా. బతుకు మీది ఆశతో మానాభిమానాలు వొదిలేసింది. తన్నినా ఆ కాళ్లను పట్టుకొనే వేళ్లాడుతూ, కన్నీటితో కాళ్లను కడిగేందుకైనా సిద్ధంగానే వుంది. దేశంలోని బీదతనమంతా ఈమెలో మూర్తీభవించిందా అనిపించింది. వాసు కసురుకుంటూన్న కొద్దీ నాకు జాలి ఎక్కువయింది. ఒకే సంఘటన ఇద్దరిలో విరుద్ధభావాల్ని రేపటం అసహజం కాదేమో?

"ఫో... ఇంకా నిలబడ్డావా?... ఇంట్లోదాకా వొచ్చావ్... ఎవ్వరూ లేకపోతే ఏదన్నా పట్టుకుపోవచ్చు, ఉంటే ధర్మ చేస్తారాయె!... ఫో..."

ధర్మదాతలకు ప్రసిద్ధికెక్కిన దేశమాయె మరి! వీళ్లను నమ్ముకునే ఎంతమంది బతుకుతున్నారో! ఐనా దీంతో అనవసర కాలయాపన యెందుకు! అనాలోచితంగానే నేమో, నా జాలి ధర్మానికి ప్రోత్సహించింది. జేబులోంచి అణా తీసి విసిరివేశాను. గడ్డిలో పడిన అణా కాసు వెతికి, ఏరుకొని వినపడీ వినపడకుండా ఏదో దీవించి వెళ్ళిపోయిందా ముష్టిది.

వాసు మొహంలో అసంతృప్తి పొడసూపింది. మరీ యీ ముష్టిది, నన్ను దీవించడమంటే, తనను దూషించటంగానే వాసు భావించి ఉంటాడు. కావాలని నే నేదో పరాభవించినట్లు ఫీలయ్యాడనుకుంటాను.

"చాలా పొరపాటు చేశావ్ భాయీ!" అన్నాడు. తన ఉద్రేకాన్ని బలవంతాన అదుపులో పెట్టుకుంటూన్నట్లు తోచింది నాకు.

"పోనిస్తూ ముష్టిముండ" అన్నాను. ఈ స్వల్ప విషయం మీద తర్కించటం ఎందుకని.

"కాదు... నీదేం పోయిందీ! రేపటినుంచి అది ప్రతిరోజూ ఈ ఇంటి చుట్టూ తిరుగుతూ, ధర్మం వేయందే కదలదు. చూస్తూ వుండు" అన్నాడు వాడు.

"నాలుగు రోజుల పాటు తరిమేస్తే గిట్టుబాటులేక ఇటువైపే రాదు" అన్నాను.

"ఇవ్వాళే తరిమేస్తే సరిపొయ్యేది. గోటితో పొయ్యేదానికి గొడ్డలి అవసరం చేశావ్... ధర్మానిక్కాదు. ఇందువల్ల దానిని పనిపాటలు చేసి, ఆరోగ్యకరంగా కాస్త గౌరవంగా బతకనీయటం లేదు. మనం ఈ వెధవ వృత్తిని ప్రోత్సహిస్తున్నాం."

"నిజమే! ఈ సమస్య ఇప్పటికిప్పుడు తేలుతుందా? అదీ మనిద్దరివల్ల జరిగేపనా? ప్రభుత్వమే పూనుకోవాలి."

"ప్రతీదానికీ ప్రభుత్వమేనా? ఎవరి చేతనైంది వాళ్లు చెయ్యక్కర్లేదా?"

"పోనిద్దూ-"

"చూశావా; తప్పుచేశాక విమర్శిస్తే ఎలా తప్పించుకుంటున్నావో? అదేదో ధర్మదాతలనగానే నీకు వొళ్లు పులకరించింది- ఔనా?" అన్నాడు వాసు ఎగతాళిగా నవ్వుతూ.

"మరి దాతలకు పేరుగాంచిన దేశమాయె ఇది!" అన్నాను.

"అదొక గొప్పగా చెప్పుకుంటున్నాంకాని, ఏ దేశంలో ఐతే దాత లెక్కువో అది దౌర్భాగ్యదేశం. ఎందుకంటే అక్కడ యాచకులు చాలా ఎక్కువ గనుక" అన్నాడు.

నేను నిర్ఘాంతపొయ్యాను. వీడితో వాదించి గెలవటం నా తలకు మించిందిగా తోచింది.

"పోనిస్తూ - అణా భాగ్యానికి!" అని ఎలాగో తప్పించుకునే ప్రయత్నంలో వున్నాను. అయితే పారిపోతూన్న శత్రువును వెంటాడే తత్వమున్న మానవుడు నన్ను విడవడనీ తెలుసు. ఇంకో మార్గం లేనప్పుడు పలాయనమే శరణ్యమనీ తెలుసు.

అదృష్టవశాత్తూ గది వాకిట్లోకి ఎవరో వొచ్చారు. ఈ వొచ్చిన వాడు కేవలం నా రక్షణోద్దేశంతోనే దూకాడనిపించింది.

ఆగంతకుడు నమస్కరించాడు. ప్లీడర్‌గారు ఠీవిగా సద్దుకొని కూర్చుంటూ, నమస్కారాన్ని గమనించీ, గమనించనట్లు "రండి, కూర్చోండి" అన్నాడు.

అతను ముందు కొచ్చాడు. ముప్పై ఏళ్లుంటవి. మొహంచూస్తే చదువుకున్న వాడల్లేనే వున్నాడు. ఏదో వ్యధ అతన్ని పీడిస్తోంది. బహుశా మొదటిసారి కోర్టు కెక్కటంలోని అనుభూతేమో ననుకున్నాను. బట్టలు కాస్తమాసి ఉన్నప్పటికీ, కాస్త మంచిరకంవిగానే కనిపిస్తున్నవి.

అతను కూర్చోలేదు. ఈ మర్యాదలకు తను అర్హుడుకానట్లే చేతులు కట్టుకొని, విశ్వాసపాత్రుడైన సేవకునివలె నిలబడ్డాడు. ప్రతిరోజూ రకరకాల మనుషుల్నీ చూస్తూండటంవల్ల ఇతను పార్టీ కాదని వాసు వెంటనే గ్రహించ గలిగి వుంటాడు.

"ఏం కావాలి?..." అన్నాడు వాసు మొహం చిట్లించి, తొందర సూచించే కంఠస్వరంతో.

అతను ఒక్కక్షణం ఎలా చెప్పాలా అని కాబోలు ఆలోచించినట్లుంది. తరువాత తనకు సంబంధంలేని వార్తను జారీ చేస్తున్నవాడివలె మాట్లాడసాగాడు: “మాది అమలాపురమండీ... ఈ ఉదయం లజ్‌లో బస్సెక్కుతుండగా ఎవరో నా పర్స్ కొట్టేశారు...”

వీడు అడుక్కునేందుకు వొచ్చాడు! అర్థమౌతూనే వుంది. ఇందాక ఆ ముష్టిదాన్ని కసిరినట్లుగా వీణ్ని కసిరే సాహసం వాసులో లేదు. పైపెచ్చు వాడు చెప్పే కథ వింటున్నాడు... వెంటనే నేను సవాలక్ష ప్రశ్నలు అడిగి, ఆ ఆగంతకుణ్ని మెలిపెడదా మనుకున్నాను. ఉదాహరణకు:– బస్ ఎందు కెక్కావు? లజ్‌కు ఎందుకు వెళ్లావు? జనంలో ఎందుకు జొరబడ్డావు? జేబులో పర్స్ ఎందుకు పెట్టుకున్నావు? పర్స్ పోతే పోలీసు స్టేషన్‌కు పోక ఈ కొంపకు ఎందుకొచ్చావు?– మొదలైనవి. ఎందుకంటే, వీణ్ని చూడగానే నాకు మహామంటగా వుంది. ఒకవేళ వీడికి భోజన సదుపాయం లేకపోయినా, రెండు రోజుల వరకు మరేం ఫర్వాలేదు. ముష్టిదానితో పోలుస్తే, వీడి కేసు ఒక లెక్కలోకి రాదు. చంకలో చిన్న బిడ్డన్నా లేదాయె వీడికి!

“పర్స్‌లో నాలుగొందలు పైచిలుకు పైకం వుంది. పోలీస్ రిపోర్టుకూడా ఇచ్చాను... నాకొక్క సహాయం చేయండి! నాకేం డబ్బక్కర్లేదు... మా యింటికి టెలిగ్రాం ఇప్పించండి. నాకు టి.ఎం.వో. వొస్తుంది; మీ డబ్బు మీకు ఇచ్చేసి నా దారిన నేను పోతా–” అన్నాడు.

క్షణంలో నా మనసుకూడా కరిగిపోయింది. వీడు అడుక్కు తినేవాడు కాదు. గౌరవమర్యాదలున్న వ్యక్తి. అనుకోకుండా దాపరించిన పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్నాడు. ఇలాగే వూరుకాని వూరులో నేను అవస్థపడొచ్చు. అప్పటి నా స్థితి ఎలా ఉంటుందో ఇప్పుడు అర్థమౌతోంది. ఇది తలుచుకుంటే నా సానుభూతి ఈ ఆగంతకుడి మీదికి మళ్ళింది. అతని కంఠస్వరంలో వేడికోలు లేదు. సభ్యతా ప్రపంచంలో తన హక్కును దేన్నో మా ముందుపెట్టి, న్యాయాన్ని దబాయించి అడుగుతున్నట్టుంది.

వాసుకూడా నాలాగే ఆలోచిస్తూండి వుంటాడు. మరుక్షణంలోనే వాడి ముఖ కళ మారింది.

“సరే ఆ టెలిగ్రాం రాసివ్వండి... పంపుతాను” అన్నాడు.

వాసు చేసిన ఈ మంచి పనికి నాకు ఆనందం కలిగింది. అతను టెలిగ్రాం రాస్తుండగానే నేను బైటపడ్డాను.

❋ ❋ ❋

ఆదివారం సాయంత్రం వాసు బీచ్‌లో కలిశాడు. చాలా చిరాగ్గానూ, అశాంతితోనూ వున్నట్లు తోచింది, నన్ను చూడగానే చకచకా నా వైపు వొస్తూ “వాడు వొట్టి మోసగాడు, వెధవ!” అన్నాడు.

"ఎవరూ?"

"వాడే! మొన్న పొద్దున నీవుండగా వొచ్చి పర్స్ పోయిందని చెప్పి, టెలిగ్రాం ఇప్పించలా- వాడు!"

"ఏం? ఏం చేశాడు? ఐనా టెలిగ్రాం ఇస్తే వాడికి వొరిగేది ఏముందీ?" అన్నాను.

"అదే నేను అనుకున్నదీను. టెలిగ్రాం ఇచ్చాక, వాడికి డబ్బొచ్చేదాకా, తిండి తిప్పల విషయం చూడాలి కదా! సానుభూతి చూపదలుచుకున్నాక, చివరికంటా చూపాల్సిందే కాని మధ్యలో ఎలా వొదులుతాం? అందులోనూ మర్యాదస్తుడుగా కనిపిస్తున్నవాణ్ని చూస్తూ చూస్తూ పస్తులెలా పడుకోబెడతాం? కనుక దేవుడో అంటూ నాతోపాటే కాఫీలూ భోజనాలు మెక్కించాను. అందుకు నాకు నష్టం లేదు. వీడికి అనవసరంగా, వృథాగా ఖర్చు పెట్టానని ఇప్పుడు అనిపిస్తోంది" అన్నాడు వాడు.

"ఇంతకూ ఏం చేశాడు? టెలిగ్రాంకు జవాబు రాలేదా? ఏమైందో చెప్పు" అన్నాను.

"అయేందు కేముందీ? ఆ టెలిగ్రామేదో చేరే వుంటుంది. కాని వీడి బాబాయ్ ఎవడూ డబ్బు పంపేవాడు లేడు. శుక్రవారం కదా వైరిచ్చింది? శుక్రవారం సాయంత్రానికి వైర్ చేరివుంటుందనీ, శనివారం టి.ఎం.వో. వొస్తుందనీ అన్నాడు. నేనూ నమ్మాను. నమ్మలేనిదేముందీ? శుక్రవారం రెండు పూటలూ భోజన సదుపాయం, పడక వ్యవహారం చూశాను. శనివారమూ అంతే. ఇవాళ ఉదయం మాయమయ్యాడు, అంతులేడు..."

"బహుశా మళ్లీ ఈ జన్మలో నీ దగ్గిరికి రాడు. ఈపాటికి మనలాటి వాడెవడో మళ్ళీ అమలాపురానికి టెలిగ్రాం ఇచ్చివుంటాడు. ఐతే ఒక విధంగా మనకే మేలు."

"ఎందుకనీ?" అన్నాడు వాసు.

"ఆనాడు శుక్రవారం కనుక, ఆర్డినరీ వైర్‌తో సరిపోయింది. ఇవాళ ఆదివారం కనుక ఎక్స్‌ప్రెస్ ఇవ్వాలి. మరి మన ఖర్చు సగమే కదా!"

"అట్లా అంటే మనకు మరో మేలుకూడా చేశాడేమో ననిపిస్తుంది. ఇంట్లో పడుకున్నవాడు, ఇంట్లో సామానులేవీ ఎత్తుకొని పోలేదు" అన్నాడు వాసు.

నేను తీవ్రంగా ఆలోచిస్తున్నాను. తన హక్కును ఎంత తేలిగ్గా జబర్దస్తీగా అమలు పరుచుకున్నాడు వాడు! హాయిగా సకల మర్యాదల్తోనూ రెండు రోజులు గడిచింది. ఈ వాసులాటివాళ్లూ నాబోటి వాళ్లూ దేశంలో చాలామంది వున్నారు. ఒక్కొక్కరి వొంతుకు రెండేసి రోజులు వేసినా, కొన్ని శతాబ్దాలపాటు వాడు నిర్విచారంగా బతకగలడు.

"వీడికి భోజనం పెట్టినందుకు కాదు నా బాధ" అన్నాడు వాసు. "వాడు భోజనం లేదంటే పెట్టేవాణ్ని; లేదా రూపాయో అర్థో ఇచ్చి పంపేవాణ్ని, ఈ వెధవ కథంతా

అల్లి మనకు టోపీ పెట్టాడు. అనవసరంగా పోస్టాఫీసు వాళ్లకు డబ్బు ఖర్చు పెట్టించాడు–ఎవరు తిన్నట్టు!"

నాకు ఛర్రుమంది. ఆనాడు కనిపించిన ముష్టిది కళ్ళ ముందు మెదిలింది. ముష్టిదాన్ని, ఈ అమలాపురం పెద్దమనిషినీ పోలుస్తే ఆ భేదం తెలుస్తూనే వుంది.

"ఇవాళ వాడు అడుక్కుంటే ఏదో పారేసేవాణ్ని అంటున్నావ్. కాని ఆనాడు ఆ ముష్టిది రెండు రోజులుగా భోజనం లేదంటే కసిరావ్ కదా? ఎందుకనీ?" అన్నాను.

"దానికి దీనికి పోలికేమిటి?"

"అంతా పోలికే! ఇద్దరూ అడుక్కుతినేవాళ్లే! ఇద్దరి ఆశయమూ వొక్కటే! ముష్టిదాన్ని పనిపాటలు చేసుకోలేవా అని అడిగావు. ఇదే ప్రశ్నను యీ అమలాపురపు ఆయనకు వేయలేదు. ముష్టిదాన్ని కసిరావు, యీ పెద్దమనిషిని గౌరవించావు. ఒకవేళ అన్నం పెట్టినా ముష్టిదానికి రాత్రి మిగిలిపోయిందేదో వేసేవాడివి. కానీ వీడికి నీతోపాటే మంచి భోజనం పెట్టించావ్. అడుక్కుంటే అంత నీచంగా చూసేవాడివా! మృష్టాన్నం లభ్యమయ్యే అవకాశం ఉండగా, అడుక్కొని అగౌరవించబడి చద్దికూడు తినే ఖర్మవాడికేం? తెలివితేటల్ని ఉపయోగించాడు. ఆ తెలివితేటలకే మెచ్చి నీవు వాడికి సకల సదుపాయాలు చేశావ్! అంతే!" అన్నాను.

వాసు ఆలోచనలో పడ్డాడు. క్షణమాగి "దానికి ఇంత డొంక తిరుగుడు దేనికంట?" అన్నాడు.

"మనం సంస్కారంతో బతుకుతున్నాం. కళారాధకులం. కళకూ జీవితానికీ ముడి పెట్టుకున్నాం. చివరకు జీవించటం కూడా కళే అయి కూర్చుంది. కళారహితంగా ముష్టిది అర్థిస్తే మన తలకెక్కదు. కళాసహితంగా అమలాపురంవాడు చెపితే ఇట్టే కరిగిపోయాం" అన్నాను.

వాడు తెలతెల బోతున్నాడు. రెండు నిమిషాలపాటు ఎవరమూ మాట్లాడ లేదు.

"చూడబోతే నాకు మరో నగ్నసత్యం కనిపిస్తోంది" అన్నాను.

"ఏమిటది?"

"మానవధర్మాలనేవి కొన్ని ఉన్నవి. ఉదాహరణకు నీకు ఇబ్బంది కలగకుండా వుంటే, నీ పక్కవాడి బాధల్ని ఆదుకోవడం. నిజానికి ఆ ముష్టిదానికి ఒక్క అణా ఇచ్చినందుకు ఎగిరిపడ్డావు! అందువల్ల మనకు కలిగే ఇబ్బంది ఏమీ లేదు. నేను మంచిపనే చేశాను; దాన్ని నేరంగా భావించావు. నేను చెప్పింది మానవధర్మమే కదా!"

"ఐతే?" అన్నాడు వాసు, ముఖం చిట్లించి.

"ఐతే యీ మానవ ధర్మాల్ని మనకు నిత్య జీవితంలో ఎవరో వొకరు, ఏదో వొక సందర్భంలో గుర్తు చేస్తుండాలి. ఆనాడు ముష్టిది జ్ఞాపకం చేసింది; అది నాకొక

హెచ్చరికగానే తోచింది. కాని, నీకు అది చాలలేదు. కళాపూరితమైన హెచ్చరిక కావాలి మరి. అందుకనే అమలాపురం ఆయన నీకు మంచి కథ అల్లి మానవధర్మ ప్రబోధం చేశాడు!"

"ఏడవలేకపొయ్యాడు!"

"ఏడవటం వాడికేం ఖర్మ? మానవ ధర్మాల్ని ప్రపంచమంతా పాకించేందుకు జీసెస్ క్రైస్ట్, శంకరాచార్యుడు, మహమ్మద్, బుద్ధుడూ, అవతరించారు. కాని యీ మహాపురుషులు ప్రతి సంవత్సరమూ పుట్టలేరు. ప్రతిరోజూ నీ ముందుకు రాలేరు. వారి అంశలున్న ఆ అమలాపురం ఆయనలాంటివాళ్లు, ఆ మానవ ధర్మాల్ని ప్రచారం చేయటమేగాక, వెనువెంటనే అమలు జరిపిస్తున్నారు."

"ఈ మానవధర్మ ప్రచారకుడు, తాను అనుసరించే మానవధర్మం ఏమిటంట?" అన్నాడు వాసు, కోపంతో.

"సూక్ష్మంగా చూస్తే అదీ వుంది. వాడికి కావాల్సింది భోజనం, రోజులు గడవటం. అంతవరకే నెగ్గించుకున్నాడు. నీ ఇంట్లో ఏమీ ఎత్తుకొని పోలేదు. దొంగతనం చేయకుండటం మానవ ధర్మమేగా! నీవు పెట్టిన ఖర్చుకు వాడు చూపిన కృతజ్ఞత! పోతూ పోతూ నిన్ను ఒక విధంగా సంతోషపెట్టాడు కదా!" అన్నాను.

వాసు జవాబు చెప్పలేకపొయ్యాడు. ఒక్క నిమిషం సేపు హోరుపెట్టే సముద్రుణ్ని చూస్తూ కూర్చొని అన్నాడు:

"ఇప్పుడు నా బాధ అది కాదు. యీ సంగతులన్నీ నీకు తెలిసినయ్యని!"

"ఏం నాకు తెలిస్తే!"

"నీకు తెలియటంవల్లనే కదా, దీని రంగంతా మార్చి మసిపూసి మారేడుకాయ చేసింది?"

"అదే ఆర్ట్! మనం కళారాధకులం. ప్రతి విషయంలోనూ కళ కావాలి. కళారహితమైన దాన్ని నిరాకరిస్తాం. మరి మనం ఆరాధించి, ఉపాసించే దాన్ని ఏవగించుకోవట మేమిటి?" అన్నాను.

"ఈ వెధవ కళమీద చర్చించటం మొదలుపెడితే ఇప్పుడు తేలుతుందా? వొస్తాను" అని, నామాట కూడా వినిపించుకోకుండా వాసు చకచకా జనంలో కలిసిపొయ్యాడు.

*ఈ కథ 'కరుణశ్రీ'గారి సంపాదకత్వంలో వెలువడిన సుభాషిణి మాసపత్రిక, 1955 జూన్ సంచికలో ప్రచురితమయింది.*